ప్రశంసలందుకున్న బాలుగీత విభావరి


గానం చేస్తున్న గాయనీగాయకులు

చిక్కడపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బాలసుబ్రహ్మణ్యం సహగాయనీమణులతో కలిసి సినిమాలలోపాడిన పాటలను నాగేశ్వరరావు, విజయలక్ష్మి వేదికపై హుషారుగా పాడగా శ్రోతలు హర్షధ్వానాలతో ప్రశంసలందజేశారు. శ్రీద్యుతి మ్యూజికల్ అకాడమీ ఇషాన్ ఫౌండేషన్ క్రియేషన్స్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో యూకో బ్యాంక్ సౌజన్యంతో ప్రఖ్యాత గాయకుడు ఎస్‌పి. బాలసుబ్రహ్మణ్యం జన్మదినం సందర్భంగా మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో గానవిభావరి జరిగింది. జంటనగరాల్లో పేరొందిన గాయనీగాయకులు ఆరుగంటలకుపైగా పాడి బాలుపై వారికున్న అభిమానం చాటారు. శ్రీధర్ సహగాయని సౌమ్యతో కలిసి పాడిన స్వాతిముత్యం సినిమాలోని పాట శ్రోతలను అలరించింది. రమణమూర్తి, సుదర్శన్, శ్రీధర్, కల్యాణ్, ప్రసన్న, కృష్ణవేణి పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా కళాపోషకులు నాగప్రసాద్‌ను సామాజిక సేవా కార్యకర్త పేరి లక్ష్మి నరసింహన్ సత్కరించారు.

కులగణన వెంటనే చేపట్టాలి



- జాజుల లింగంగౌడ్

అంబర్‌పేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రభుత్వం చెప్పినట్లు రాష్ట్రంలో బీసీ కులగణనను వెంటనే చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన అంబర్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ కులగణన చేపడతామని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారని అందుకు అనుగుణంగా ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.

చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుంది

- తెలుగునాడు రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు బోస్

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని తెలుగునాడు తెలంగాణ రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు ఎం. కె. బోస్ అన్నారు. చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారానికి తెలుగునాడు కార్మిక విభాగం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. మంగళవారం రాంనగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు వచ్చే అయిదేళ్ల పాలనలో అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతుందని, పోలవరం ప్రాజెక్ట్ ప్రజోపయోగంలోకి వస్తుందన్నారు.

గోల్నాక, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి భారీ మెజార్టీతో ఘనవిజయం సాధించి నారా చంద్రబాబునాయుడు నాలుగో సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కె.దర్గాప్రసాద్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు చింతల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఏపీ పునర్ నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యం

అంబర్‌పేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఐదుళ్లుగా ఏపీ రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, ఏపీ పునర్ నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యం అని అంబర్‌పేట టీడీపీ నేత ఓ. వెంకటేష్‌చౌదరి అన్నారు. మంగళవారం అంబర్‌పేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేత జగన్‌రెడ్డి సంక్షేమ పథకాల పేరు చెప్పి ఏపీని సర్వనాశనం చేశాడని ఆరోపించారు. చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏపీని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి సన్మానిస్తున్న అంబర్‌పేట నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ శ్యామ్‌రాజ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ వనం రమేష్‌లు
- నల్లకుంట, ఆంధ్రజ్యోతి


ఆలీకేఫ్ చౌరస్తాలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నేతలు
-అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

రాగుల ప్రవీణ్ కుటుంబాన్ని అదుకుంటాం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన అంబర్‌పేట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు రాగుల ప్రవీణ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా అదుకుంటామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. రాగుల ప్రవీణ్ సంతాప సభ అంబర్‌పేట డివిజన్ చెన్నారెడ్డినగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి రాగుల ప్రవీణ్ అమూల్యమైన సేవలందించారని అన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి ఆయన కృషి చేశారని అన్నారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాగుల ప్రవీణ్ అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, రామారావుయాదవ్, అమనూరి సతీష్, లింగారావు, ప్రవీణ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. రాగుల ప్రవీణ్ కుమార్తెకు రూ.3 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించారు.

డ్రగ్స్ అమ్ముతున్న ఐదుగురు అరెస్ట్

మదీన, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరు నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి నగరంలో అమ్మటానికి ప్రయత్నిస్తున్న ఐదుగురు వ్యక్తులను మంగళవారం బహదూర్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.రఘునాథ్ తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేటకు చెందిన ఫైసల్, అతని భార్య బషరత్‌తోపాటు అంబర్‌పేటకే చెందిన అబ్రార్, చందులాల్ బారాదరికి చెందిన రహ్మత్, బెంగుళూరుకు చెందిన జునైద్ వీరి ఐదుగురు నార్కోటిక్ డ్రగ్స్‌కు తీసుకువచ్చి అమ్ముతుంటారు. అందులో భాగంగా బెంగుళూరు నుంచి డ్రగ్స్ తీసుకువచ్చిన కస్టమర్లకు అమ్మటానికి ప్రయత్నిస్తున్నారు. హసన్‌నగర్ వద్ద ఉన్నారని విశ్వసనీయ సమాచారం మేరకు బహదూర్‌పురా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2 లక్షల విలువ చేసే 34 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

నల్లకుంటలో అదృశ్యం... నాలాలో శవమై తేలిన సుజాత

బర్కత్‌పుర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటలో అదృశ్యమైన ఓ మహిళ హుస్సేన్‌సాగర్ నాలాలో శవమై తేలింది. కాచిగూడ పీఎస్ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్న దివంగత మల్లేష్‌రావు భార్య కె.సుజాత(47)కు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఐదేళ్లుగా సుజాత బ్యాక్ పెయిన్‌తో సతమతమవుతుంది. మెడిసిన్ వాడిన తగ్గలేదు. దీంతో తీవ్ర మానసిక క్షోభకు గురైంది. ఈ నెల 7న ఇంటి నుంచి బయటకు వెళ్లిన కె.సుజాత తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు నల్లకుంట పీఎస్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం కృష్ణానగర్ సమీపంలో హుస్సేన్‌సాగర్ నాలా మూసీలో కలిసే వద్ద మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు అంబర్‌పేట పోలీసులకు సమాచారం అందించారు. వారు కాచిగూడ పోలీసులను అప్రమత్తం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళ మృతదేహం అదృశ్యమైన కె. సుజాతగా గుర్తించారు. ఈ నెల 10వ తేదీన సాయంత్రం 5. 45 నిముషాల సమయంలో రత్నానగర్ శ్రీహనుమాన్ దేవాలయం వద్ద ఓ మహిళ హుస్సేన్‌సాగర్ నాలాలో దూకినట్లు సీసీ కెమెరాలలో నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ఆ మహిళ సుజాత అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మ్యాన్‌హోళ్లు తెరిస్తే క్రిమినల్ కేసులు

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో మ్యాన్‌హోళ్ల మూతలు తెరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వాటర్‌బోర్డు హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘించి మ్యాన్‌హోళ్ల మూతలను తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంది. వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా ఉండేందుకు ఈ సూచనలు చేశారు. వాటర్‌బోర్డు యాక్ట్ -198 9సెక్షన్74 ప్రకారం అధికారుల అనుమతి లేకుండా మ్యాన్‌హోళ్లపై ఉన్న మూత తెరచినా, తొలగించినా నేరం. దీన్ని అతిక్రమించి, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. నిందితులకు జరిమానా విధించడంతోపాటు జైలు శిక్ష కూడా వేసే అవకాశముంది. నగరంలో ఎక్కడైనా మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనిస్తే వాటర్‌బోర్డు కస్టమర్ కేర్ నంబర్ 155313కి ఫోన్‌చేసి సమాచారమివ్వాలని, దగ్గరలోని వాటర్‌బోర్డు కార్యాలయాల్లో నేరుగా సంప్రదించాలని ఎండీ సుదర్శన్‌రెడ్డి సూచించారు. వర్షం వస్తే మ్యాన్‌హోళ్లలో పడి మృతి చెందిన ఘటనల నేపథ్యంలో వాటర్‌బోర్డు అప్రమత్తమైంది. మ్యాన్‌హోళ్లను తెరవకుండా నగరవాసుల్లో అవగాహన కల్పించడంతో పాటు హెచ్చరికలు జారీ చేసింది. ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంది. 25వేలకు పైగా మ్యాన్‌హోళ్లకు సేఫ్టీగ్రిల్స్ బిగించారు. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్‌తో సీల్ చేసి, రెడ్ పెయింట్ వేశారు. మ్యాన్‌హోళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో సీవరేజి బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరు ఉదయాన్నే క్షేత్రస్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారు.


మ్యాన్‌హోల్‌కు ఏర్పాటు చేసిన సేఫ్టీ గ్రిల్

విస్తృతంగా ప్రచారం

వర్షాకాలంలో సీవరేజి నిర్వహణలో పౌరులు ఎలా ప్రవర్తించాలి, ఎలా నడుచుకోవాలనే అంశాలపై వాటర్‌బోర్డు విరివిగా ప్రచారం చేస్తోంది. స్థానిక కాలనీల సంఘాలు, ఎస్‌హెచ్ గ్రూపుల సభ్యులతో ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. చేయాల్సిన, చేయకూడని పనులపై పత్రికలు, టెలివిజన్, ట్విటర్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయడానికి సమాయత్తమవుతోంది.

శాఖల సమన్వయంతో పనులు

జీహెచ్‌ఎంసీ, పోలీసు శాఖల అధికారుల సమన్వయంతో పనులు చేయనున్నారు. వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్(ఎస్పీటీ) వాహనాలను రంగంలోకి దింపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలను అందించారు. ఈ బృందాలకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్‌తో కూడిన డీవాటర్ మోటార్ ఉంటుంది. దీని సాయంతో వర్షపు నీటిని తొలగిస్తారు. చోకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తారుఎయిర్‌టెక్ మెషీన్‌లు సైతం అందుబాటులో ఉన్నాయి. మ్యాన్‌హోళ్ల నుంచి తీసిన వ్యర్థాల(సిల్ట్)ని ఎప్పటికప్పుడు తొలగిస్తారు.

ఓంశ్రీసాయిరాం ఫైనాన్స్ కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: ఆర్. కృష్ణయ్య

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ పేరుతో రైతుల నుంచి లక్షల రూపాయల డిపాజిట్‌లు తీసుకుని, రూ.150 కోట్లకు పైగా మోసం చేసిన ఓంశ్రీసాయిరాం ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లో బాధితుల రైతులకు మద్దతుగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ఓంశ్రీసాయి ఫైనాన్స్ మేనేజింగ్ పార్టనర్స్ ఇ.సాయిబాబు, ఇ. ధనుంజయ్, ఇ.బాలేశ్వర్, ఇ.రజిత, ఇ.యామిని, ఇ.శారద, ఇ.దివ్య, ఇ.దీక్షిత్‌లు ప్రభుత్వం అనుమతి లేని ఫైనాన్స్ కంపెనీని నాగర్ కర్నూలు పట్టణంలో ఏర్పాటు చేశారని ఆరోపించారు. వనపర్తి జిల్లాలో సుమారు 20 గ్రామాల అమాయకపు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ భూ నిర్వాసితల వద్ద రూ.2 శాతం వడ్డీ ఆశ చూపించి సుమారు రూ.150 కోట్లు వసూలు చేసి, మోసం చేశారని ఆరోపించారు. ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బులు చెల్లించకుండా 2021 లో మూసివేశారని ధ్వజమెత్తారు. ఈ మేరకు బాధితులైన జి.ఎల్లమ్మ, ఆమె భర్త రాములు ఓంశ్రీసాయి ఫైనాన్స్ మేనేజింగ్ పార్టనర్ ఇ.సాయిబాబుపై నాగర్‌కర్నూలు పీఎస్‌లో ఎఫ్ఐఆర్ 69/2023 యు/ఎస్ 406, 420 ఐపీఎస్, 5టీఎస్‌పీడీఎఫ్ఈఏ కేసు ఫైల్ చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ ఒక్కటే కాకుండా ఎటువంటి కేసులు ఎన్నో కేసుల ఫిర్యాదులు ఉన్నాయని అన్నారు. వీటిపై నాగర్ కర్నూలు జిల్లా ఎస్పీ, సీఐ, ఎస్ఐ గానీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు కూడా తీసుకోలేదన్నారు. బాధితులు పీఎస్‌కు వెళ్తే పోలీసులు వారినే బెదిరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఆర్థిక మోసానికి పాల్పడిన ఓంశ్రీసాయిరాం ఫైనాన్స్ మేనేజింగ్ పార్టనర్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై బీనామిలపై ఉన్న ఆస్తులను జప్తు చేయాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, అనంతయ్య, వేముల రామకృష్ణ, పర్వతాలు, రాజేందర్ బాధిత రైతులు పాల్గొన్నారు.


మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని విద్యానగర్ ర్యాలీలో పాల్గొని మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

రూ.10.86 కోట్లు కొల్లగొట్టారు

- యూ ట్యూబ్ చానళ్లలో ప్రచారం నిర్వహించిన కేటుగాడు
- శిక్షణ కోసం రూ. లక్ష ఫీజు వసూలు
- సహకరించిన భార్య, కొడుకు, అడ్వొకేట్
- నలుగురి అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మోసపోయే వారు ఉన్నంత కాలం మోసం చేసే వారు ఉంటారనడంలో అతిశయోక్తి లేదు.. ఏపీకి చెందిన శివయ్య సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం భార్య కొడుకు, ఓ అడ్వొకేట్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. రెండు యూ ట్యూబ్ చానళ్లు ఏర్పాటుచేశారు. ఓ చానల్ ద్వారా ప్రకృతి వైద్యుడిగా శివయ్య ప్రచారం చేసుకున్నాడు. మరో చానల్ ద్వారా రియల్ ఎస్టేట్‌లో డబ్బు సంపాదించేందుకు శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణ తీసుకునే వారి నుంచి రూ. లక్ష ఫీజు వసూలు చేశారు. మొత్తం రూ. 10 కోట్లకు పైగా వసూలు చేసి బిచాణా ఎత్తేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు విచారణ చేపట్టి మంగళవారం నలుగురిని అరెస్టు చేశారు. నగరంలో ఉంటున్న ఏపీకి చెందిన శివయ్య అలియాస్ శివకుమార్ భార్య స్వర్ణలత, కొడుకు జశ్వంత్, అడ్వకేట్‌తో కలిసి సులభంగా డబ్బు సంపాదించేందుకు పథకం వేశాడు. మీమాంస, రీబూట్ పేరుతో రెండు యూ ట్యూబ్ చానళ్లు ప్రారంభించారు. ప్రకృతి వైద్యంపై అవగాహన ఉండటంతో మీమాంస చానల్ ద్వారా శివయ్య బీపీ, మధుమేహం, థైరాయిడ్, కేన్సర్ వ్యాధులకు సలహాలు, సూచనలు ఇచ్చేవాడు. నమ్మిన వారిని మభ్యపెట్టి రీబూట్ అనే మరో చానల్ ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో డబ్బు సంపాదన కంటూ శిక్షణ ఇచ్చేవాడు. ఇందుకుగాను రూ. లక్ష ఫీజు వసూలు చేసేవాడు. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెడితే తక్కువ కాలంలో లాభాలొస్తాయని నమ్మించాడు. నమ్మిన 70 మంది లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టారు. వారి నుంచి శివయ్య రూ. 10.86 కోట్లు కొల్లగొట్టాడు. ఎంతకూ లాభాలు రాకపోవడంతో డబ్బులు ఇచ్చిన వారు నిలదీయగా తాను గత ప్రభుత్వంలో కొంతమంది పెద్దలకు బినామీ అని, నన్ను ఎవరూ ఏమీ చేయలేరని బెదిరించాడు. శివయ్య తీరుపై అనుమానం వచ్చిన బాధితులు పోలీసులను ఆశ్రయించగా అరెస్టు చేశారు. అతడిని విచారించగా.. భార్య స్వర్ణలత, కొడుకు జశ్వంత్, అడ్వొకేట్ శ్రీనివాస్‌తో కలిసి మోసం చేస్తున్నట్టు చెప్పాడు. వారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన శివకుమార్, అతని కొడుకు జశ్వంత్ గతంలో జైలు కెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. మళ్లీ మోసాలకు పాల్పడుతున్నారు. మీమాంస, రీబూట్ పేరుతో జరిగే మోసాలను నమ్మొద్దని, ఆర్థిక మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీసీఎస్ డీసీపీ సూచించారు.

గ్రూప్-2, 3లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్‌సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్‌సీ ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న గ్రూప్-2, 3లో ఉచిత శిక్షణ కోసం ఆసక్తి కలిగిన మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మహ్మద్ ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 45 రోజులపాటు ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు. అభ్యర్థులు హైదరాబాద్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, దరఖాస్తులను ఈనెల 18లోగా ఆబిడ్స్‌లోని తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్, నాంపల్లి హజ్‌హౌస్‌లోని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. తరగతులు జూన్ 19వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23240134లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆరె కటికల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆరె కటికల అభివృద్ధి, సంక్షేమానికి 500 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆరె కటిక అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూంపల్లి అశోక్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వైన్స్ టెండర్లలో ఆరె కటికలకు 30 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీసీ డి గ్రూప్ నుంచి బీసీ ఏ గ్రూప్‌లో కల్పిస్తూ జీవో విడుదల చేయాలన్నారు. ఆరెకటికల మటన్ షాపులకు ఉచిత కరెంట్ సరఫరా అందించాలని, ఆరె కటిక మహిళల ఆర్థికాభివృద్ధికి రూ.3 లక్షల బ్యాంకు రుణం ఇవ్వాలన్నారు.


శ్రీనివాసనగర్ కాలనీలో సీవరేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి తదితరులు

సీవరేజీ పనులను త్వరగా పూర్తి చేయాలి

- కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కాలనీలో సీవరేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె శ్రీనివాసనగర్‌లో పర్యటించి నిర్మిస్తున్న సీవరేజీ పనులను జలమండలి అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, రాజు, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో అన్ని నియోజకవర్గాలతో పాటు అంబర్‌పేటపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు ఎక్కాల నందు, సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి ఏడెల్లి అజయ్‌కుమార్‌లు బొగ్గు గనుల శాఖ మంత్రి గా నియమితులైన సందర్భంగా ఢిల్లీలోని ఆయన నివాసంలో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, ఆయన సతీమణి కావ్యకిషన్‌రెడ్డిలను శాలువపూలబొకేతో సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చూపిన ఆదరణను ఎప్పటికీ మరచిపోలేనని రుణపడి ఉంటానన్నారు. మరింత అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ఫ్లైఓవర్ పనులు సత్వరమే పూర్తయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు.


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఆయన సతీమణి కావ్యకిషన్‌రెడ్డిలను సత్కరిస్తున్న అజయ్‌కుమార్, ఎక్కాల నందు తదితరులు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

చిక్కడపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఫైనాన్స్‌శాఖ విడుదల చేసిన జీవో 970ని ఉపసంహరించుకోవాలని, నగరపాలక సంస్థలు, పురపాలక సంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, నీటి సరఫరా విభాగం తదితర ఉద్యోగులకు తెలంగాణ 2వ పీఆర్‌సీలో ఫైనల్ చేసిన జీవోల ప్రకారం వేతనాలు ఇవ్వాలని కోరారు.


క్రాస్‌రోడ్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

చిక్కడపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఈ కూడలిలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. అశోక్‌నగర్ నుంచి వచ్చే వాహనదారులు వీఎస్టీ వెళ్లాలంటే క్రాస్‌రోడ్ నుంచి ఎడమవైపునకు వెళ్లి యూటర్న్ తీసుకుని మళ్లీ చౌరస్తాకు వచ్చి వెళ్లాల్సి వస్తోంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి ఇందిరాపార్కు, అశోక్‌నగర్, సెక్రటేరియేట్ వెళ్లాల్సినవారు చౌరస్తా నుంచి ఎడమవైపు మీదుగా అరోరా కాలేజీనుంచి యూటర్న్ తీసుకుని రావాల్సి వస్తోంది. చిక్కడపల్లి నుంచి వచ్చే వాహనాల రద్దీతో ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సులు, మినీ బస్‌లు, పెద్దపెద్ద ఆటోట్రాలీలు యూటర్న్ తీసుకోవడం కష్టం కావడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య బాగా ఉండడంవల్ల చౌరస్తాలో వాహనాలు నిలిచిపోతున్నాయి. కనీసం రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌ను క్రాస్‌రోడ్ నుంచి పంపిస్తే కొంతైనా సమస్య పరిష్కారమవుతుందని పలువురు పేర్కొంటున్నారు.


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలి

అంబర్‌పేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ న్యూపటేల్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానికులకు ఇబ్బందులు కలగకుండా పనులు వెంటనే పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.


రాంనగర్‌లో జోరుగా పడుతున్న వర్షం

ముషీరాబాద్‌లో భారీ వర్షం

ముషీరాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో మంగళవారం రాత్రి జోరుగా వర్షం పడింది. రోడ్లపై వర్షం నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. లోతట్టు ప్రాంతాలైన బాపూజీనగర్, పార్శీగుట్ట, రాజాడీలక్స్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో వర్షం నీళ్లు రోడ్లపై నిలిచిపోయాయి. ఏకతాటిగా వర్షం పడడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావును సత్కరిస్తున్న తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, తదితరులు

బ్రాహ్మణులను ఆదుకోవాలి

- తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు

రాంనగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దారిద్ర్యరేఖ దిగువనున్న బ్రాహ్మణులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించి ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావును కోరారు. మంగళవారం వేణుగోపాల్‌రావును ఆయన కార్యాలయంలో కలిసి బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించామని రమణారావు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని బ్రాహ్మణులు నేటికీ పేదరికంలో ఉన్నారని పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ ఇస్తూ ఉపకార వేతనాలను వెంటనే అందించాలని కోరారు.